క్లుప్తంగా

వైభవంగా బూరుగులమ్మ తీర్థం



బూరుగులమ్మ అమ్మవారు

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన గ్రామ దేవత బూరుగులమ్మ తల్లి తీర్థం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మివారికి గ్రామ ఆడపచులు ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు, నైవేద్యాలు చెల్లించారు. అంతకుముందు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గురువారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలు, కోయ డ్యాన్సులు, తీన్‌మార్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా గంగమ్మ జాతర

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో యాదవుల వంశ ఆరాధ్య దైవం అయిన భాగిత్తమ్మ(గంగమ్మ)జాతర శుక్రవారం ఘనంగా జరిపారు. బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాలు, కొమ్ము బూరలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం గంగమ్మ తల్లికి విశేష పూజలు జరిపారు. ప్రజలు పశు సంపద, పాడి పంటలతో తులతూగాలని యాదవులు ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పాలకొల్లుకు చెందిన రాజకొండలరావు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,001 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

3న అప్పనపల్లిలో చాగంటి ప్రవచనం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో జూలై 3న ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేశామని ఆలయ ఈవో గ్రంధి మాధవి శుక్రవారం తెలిపారు. 3వ తేదీ బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు వేంకటేశ్వర వైభవం అనే అంశంపై చాగంటి ప్రవచనం జరుగుతుందన్నారు. భక్తులు ఈ ప్రవచనం కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

ఊడిమూడిలంక వంతెన పనుల ప్రగతిపై సమీక్ష

పి.గన్నవరం: ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదీ పాయపై నిర్మిస్తున్న వంతెన పనుల ప్రగతిపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం పి.గన్నవరంలోని తన కార్యాలయంలో పీఆర్ ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంతవరకూ జరిగిన వంతెన నిర్మాణ పనుల వివరాలను పీఆర్ డీఈ అన్యం రాంబాబు ఎమ్మెల్యేకి వివరించారు. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా శరవేగంతో వంతెన నిర్మాణం జరుగుతుందని రాంబాబు తెలిపారు. వంతెన నిర్మాణ విషయంలో అధికారులకు పూర్తి సహకారం అందిస్తానని, ప్రభుత్వంతో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి లంకలో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. ఎమ్మెల్యేని కలసిన వారిలో ప్రాజెక్టు ఏఈఈ దుర్గా కొండలరావు, గంగాధర్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌కు పిల్లలను పంపించండి



ఉయ్యూరివారి మెరక అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్వహిస్తున్న గ్రాడ్యుయేషన్ డే

సఖినేటిపల్లి: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌కు పంపాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి కోరారు. శుక్రవారం ఉయ్యూరువారి మెరక అంగన్‌వాడీ సెంటర్‌లో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అధ్యక్షతన అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది రా, కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో రమాదేవి మాట్లాడుతూ, ప్రీస్కూల్స్ నందు మంచి వాతావరణంలో పిల్లలకు సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ గుబ్బల అంజిబాబు, సూపర్‌వైజర్ కె.చంద్రకళ, చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ అధికారి వాణి, మహిళా పోలీసులు మీనాకుమారి, సూజన్, టీచర్లు రత్నకుమారి, నందిని, పద్మావతి, శేషవేణి, జ్యోతి విజయలక్ష్మి, పార్వతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

నాణ్యమైన నారుతో మేలైన దిగుబడి

- నారుమడిలో యాజమాన్య పద్ధతుల పాటించాలి
- ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు
- నారు నాటే ముందు కొనలు తెంచాలి



కొత్తపేటలో రైతుతో పాటు నారుమడి పరిశీలిస్తున్న వీఏఏ కార్తిక్

కొత్తపేట: ఖరీఫ్ సాగుకు వాతావరణ అనుకూలించింది. రైతులు నారుమడులు ప్రక్రియ ముమ్మరంగా మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో సాగు ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించేందుకు ఆరోగ్యకరమైన నారు ఎంతగానో దోహదపడుతుంది. నారుమడులకు నేల తయారీ దశ నుంచి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారుల, సిబ్బంది క్షేత్ర స్థాయిలోకి వెళ్లి రైతులకు వివరిస్తున్నారు. దానిలో భాగంగా కొత్తపేటలో తూర్పు ఆయకట్టు (గణేష్‌నగర్) సమీప ప్రాంత రైతులు ముందస్తుగా నారుమడులు పోసి, నాట్లు వేస్తారు. స్థానిక వీఏఏ కార్తిక్ ఆ ప్రాంత రైతులతో పాటు ప్రస్తుతం నారుమడులు వేస్తున్న, వేయడానికి సిద్ధంగా ఉన్న రైతులకు నారుమడి యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

మూడు నియోజకవరాల్లో 68,735 ఎకరాల్లో ఖరీఫ్ సాగు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 34,702 ఎకరాల్లో, పి.గన్నవరం నియోజకవర్గంలో సుమారు 25,382 ఎకరాలు, రాజోలు నియోజకవర్గంలో సుమారు 8,650 ఎకరాలతో మొత్తం మూడు నియోజకవర్గాల్లో సుమారు 68,735 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

నారుమడి తయారీ..

నారుమడి వేయడానికి ఎంచుకున్న నేల సారవంతమైనదై ఉండాలి. నారుమడి పోయడానికి ఎప్పుడూ మెరక ప్రదేశాన్నే ఎంచుకోవాలి. ఎకరం విస్తీర్ణానికి 3 సెంట్లు నారుమడి తయారు చేసుకోవాలి. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి, చదును చేసి, నారు పెట్టడానికి, నీరు తీయడానికి వీలుగా గాడి తీసుకోవాలి. వీలైనంత వరకూ బాగా చివికి సేంద్రియ ఎరువులను ఆఖరి దమ్ములో కలియదున్నాలి. కలుపు లేకుండా చూసుకోవాలి.

విత్తనాలు, విత్తనశుద్ధి

ఎకరానికి 3 సెంట్ల నారుమడిని ఎంచుకోగా 25 నుంచి 30 కేజీలు విత్తనాలు తీసుకోవాలి. గత రెండు మూడేళ్లుగా బెంగాలీ నాట్ల విధానం అవలంబిస్తున్నారు. దానికి 20 కేజీలు సరిపెడుతున్నారు. అదే వెదచల్లడానికైతే 15 నుంచి 20 కేజీలు వేస్తున్నారు. విత్తనశుద్ధి ప్రక్రియను విధిగా చేపట్టాలి. కిలో విత్తనానికి 2.5 గ్రాములు కార్బండిజమ్ కలిపి 24 గంటలు నీటిలో నానబెట్టాలి. దుంప నారుమళ్లకైతే లీటరు నీటికి 1 గ్రాము కార్బండిజమ్ కలిపి ఆ ద్రావణంలో నానబెట్టి, 24 గంటలు గాలి తగలకుండా మండి కట్టాలి. తరువాత విత్తనాలు తయారు చేసిన మడిలో విత్తనాలు చల్లే ముందు దమ్ములో అవసరం మేరకు ఎరువులు చల్లుకోవాలి. విత్తనాలు నేలనంటిన తరువాత నెమ్మదిగా మడి నుంచి నీరు దించాలి. నారు ఏపుగా పెరగటానికి 3 సెంట్ల నారు మడికి 5 కేజీల యూరియా చల్లుకోవాలి.

నేటి విద్యార్థులే రేపటి పాలకులు



తొండవరంలో శ్రీరామాంజనేయరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: నేటి విద్యార్థులే... రేపటి పాలకులని, అలాంటి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే ఘనత ఒక ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన బీర శ్రీరామాంజనేయరావు సన్మాన సభ హెచ్‌ఎం పీవీ కేశవచార్యుల అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించే ఉపాధ్యాయులకు ఎల్లవేళలా సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన శ్రీరామాంజనేయరావు, సృజన దంపతులను ఎమ్మెల్యే, పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. అంతకుముందు ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్స్ కిట్‌లను విద్యార్థులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణను స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు పేరాబత్తుల దొరబాబు, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, బొంతు సూర్యనారాయణ, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం



మామిడికుదురు సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు: మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఉద్ఘాటించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు అనుగుణంగా జూలై ఒకటి నుంచి పెంచిన పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఇతర హామీలను కూడా తప్పనిసరిగా అమలు చేస్తామని భరోసానిచ్చారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యోగులు ధైర్యంగా పని చేయాలని, ఎవరికి ఏ విధమైన ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఏ విధమైన సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే దాన్ని పరిష్కరిస్తానన్నారు. కలిసి పనిచేద్దాం అభివృద్ధిని సాధిద్దామంటూ ఉద్యోగులకు హితబోధ చేశారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, టీడీపీ, జనసేన, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు, మెండా ఆదినారాయణ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఎంపీడీఓ వేణుగోపాలరెడ్డి, ఏఓ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పి.గన్నవరం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావు రూ.30 వేలతో కొనుగోలు చేసిన నోటు పుస్తకాలను, విద్యా సామగ్రిని శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన 12 మంది విద్యార్థులతో ఆయన అక్షరాభ్యాసం చేయించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్‌ఎం ఆనందరావును ఎమ్మెల్యే గిడ్డి సత్కరించారు. సర్పంచ్ వడలి కొండయ్య, ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రం, ఎంపీటీసీలు పులపర్తి రాజారావు, ఆదిమూలం సూరయ్యకాపు, నాయకులు సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తాటికాయల శ్రీను, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మలికిపురం: నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ, పోలీసు, ఎంపీడీవో, సహకార శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు ప్రధానమైన అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. వర్షాకాలం మొదలైన తరుణంలో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీరు కాలుష్యం జరగకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, అక్రమంగా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని మైనింగ్, రెవన్యూ, పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. రాబోయే కాలంలో గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో ముందస్తు చర్యలపై దృష్టి పెట్టాలని కూడా అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడా కూడా గంజాయి వినియోగం లేకుండా పక్కా ప్రణాళిక చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు, ఎస్సైలు సంపత్ కుమార్, పృథ్వీరాజు, తహసీల్దార్లు జి.అనిత కుమారి, కె.గోపాలకృష్ణ, డీటీ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవోలు బి.మంగాదేవి, కె.సత్యనారాయణ, బాలాజీ, జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.మురళీ కృష్ణ, మైనింగ్, ఎక్సైజ్ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వర్షం తగ్గినా ముంపు వీడలేదు



అప్పనపల్లిలో ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీగా నిలిచిన వర్షం నీరు

మామిడికుదురు: రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షానికి రహదారులు పూర్తిగా పాడైపోయాయి. శుక్రవారం వాతావరణం శాంతించింది. వర్షం తగ్గడంతో ప్రజలు సేద తీరారు. అయినప్పటికీ రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అప్పనపల్లిలో ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుపై పలు చోట్ల ముంపు నీరు నిలిచిపోయింది. అది ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, మామిడికుదురు, మొగలికుదురు, గెద్దాడ గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. మామిడికుదురు 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి కొర్లగుంట వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోవడంతో అటు వైపు ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన వాహనాలు వెళ్లకుండా స్థానికులు కట్టడి చేశారు. రోడ్డుకు రెండు వైపులా కర్రలు పాతి కేవలం దిచక్ర వాహనాలు మాత్రమే వెళ్లే విధంగా వెదురుగెడలు కట్టారు. ఈ మార్గంలో రాకపోకలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడిగా ఇళ్ల మధ్య రోడ్డు



ఉయ్యూరువారి మెరకలో 5, 6 వార్డుల్లో వర్షాలకు చిత్తడిగా మారిన ఇళ్ల మధ్య రోడ్డు

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరకలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని కమ్యూనిటీ హాల్‌కు చేరి వినాయకుని గుడి వద్ద మొండికోడు చానల్ వరకూ కాలనీకి చేరి ఇళ్ల మధ్యగా ఉన్న రోడ్డు కొద్దిపాటి వర్షానికి చిత్తడిగా మారుతోంది. పంచాయతీ పరిధిలోని 5, 6 వార్డులకు చెందిన సుమారు 100 కుటుంబాల వాళ్లు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి ఉంది. సుమారు 800 మీటర్ల మేర ఉన్న ఈ పుంత మార్గానికి రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఎర్రకంకర రోడ్డు కాలక్రమంలో అడపా దడపా కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. వినాయకుని గుడి వద్ద నుంచి కొంత మేర సీసీ రోడ్డు వేసినప్పటికీ మిగిలిన మార్గం అంతా వర్షాలకు చిత్తడిగా ఉంటోందని వారు వాపోయారు. తమ రాకపోకలకు అసౌకర్యంగా ఉన్న ఈ మార్గం పూర్తి స్థాయిలో అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలని స్థానికులు పంచాయతీ పాలకవర్గానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మామిడికుదురులో పారిశుధ్య వివరాలు తెలుసుకుంటున్న డీఎల్పీఓ బుజ్జిరాజు

మామిడికుదురు: డయోరియాపై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని అమలాపురం డీఎల్పీఓ పి.బుజ్జిరాజు సూచించారు. ఆయన శుక్రవారం మామిడికుదురు, పాశర్లపూడిలంక గ్రామాల్లో పర్యటించారు. వాటర్ ట్యాంకుల వద్ద చేపట్టిన పారిశుధ్య చర్యలను పరిశీలించారు. పంచాయతీ ఉద్యోగులతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ట్యాంకుల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని, బొండం గుల్లలు, డొక్కలు వంటి వాటి వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాటి పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఫ్రిజ్‌లలో నిల్వ ఆహారం ఉండకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా అనుమానితులు ఉంటే వారికి వెంటనే పరీక్షలు చేయించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటర్ టెస్టింగులు చేయించాలన్నారు. వాటర్ ప్లాంట్లను కూడా నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఈఓ పీఆర్డీ తోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పీవీఎస్‌వీ ప్రసాద్, సురేష్, పలు శాఖల ఉద్యోగులు ఉన్నారు.

పారిశుధ్య చర్యలతో అంటువ్యాధుల నివారణ



మూలస్థాన అగ్రహారంలో డ్రైడే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా అంటువ్యాధుల నివారణ సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ కోరారు. డ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. అంటువ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలన వివరించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ అన్నారు. శుక్రవారం స్థానిక సంహిత డిగ్రీ కాలేజీలో ఐసిఎస్‌టిపి ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మేళాకు 235 మంది హాజరు కాగా ఒక కంపెనీకి 74 మంది ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో సంహిత విద్యాసంస్థల చైర్మన్ దినేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎండీ రంగరాజుకు ప్రతిష్టాత్మక అవార్డు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలేనికి చెందిన ఎన్‌సీసీ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రంగరాజు(హైదరాబాద్), ప్రతిష్టాత్మకమైన ఇండియాస్ ఇంపాక్ట్‌ఫుల్ లీడర్ అవార్డును దక్కించుకున్నారు. ఆయన తరఫున పై అవార్డును డైరెక్టర్(రవాణా) వినోద్ కుమార్ యాదవ్ స్వీకరించారు. ఈ నెల 27న ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన టైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్‌లో డాక్టర్ సంజయ్ కొల్టే(సీఎండీ), పూణె మహానగర్ పరివాహన్ మహామండల్ లిమిటెడ్(పీఎంపీఎంఎల్) నుంచి ఈ అవార్డును యాదవ్ తీసుకున్నారు. రంగరాజు అంకిత భావానికి, వినూత్న నాయకత్వానికి నిదర్శనంగా(ఎక్స్‌లెన్స్, లీడర్‌షిప్ ఇన్ ది ఇన్‌డస్ట్రీ)పై అవార్డు నిలిచింది. రంగరాజుకు అవార్డు రావడంపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌రావు, రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు, సింగరేణి కాలరీస్ డీజీఎం(పర్సనల్) ఆర్‌సీవీ రాజు అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బెల్లంపూడి కాలనీలో జ్వరపీడితులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర

పి.గన్నవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావు దొర అన్నారు. మండలంలోని బెల్లంపూడి అంబేద్కర్ కాలనీలో ఇటీవల విషజ్వరాలు విజృంభించిన నేపథ్యంలో శుక్రవారం ఆ ప్రాంతాన్ని దుర్గారావు దొర పరిశీలించారు. జ్వరపీడితులతో మాట్లాడి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించాలని ఆదేశించారు. జ్వరాలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సర్పంచ్ బండి మహాలక్ష్మి, బండి రమేష్, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ఎం.శామ్యూల్‌రాజు, ఎస్.రవీంద్ర, కె.శిరీష, వైకే ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి

అయినవిల్లి: సచివాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు వచ్చే సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష జరిపారు. సమావేశంలో ప్రజలు, ప్రజాప్రతినిధులతో మమేకమై పనిచేయాలని సూచించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా పనిచేయాలన్నారు. ఫించన్ల పంపిణీ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రజాదర్బారుకు వచ్చిన సమస్యలపై స్పందన, హౌస్ హోల్డ్ సర్వే మొదలకు అంశాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫామ్, షూస్

అంబాజీపేట: స్టూడెంట్ కిట్‌లలో భాగంగా విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫామ్, షూలు, బ్యాగ్‌లను మండలంలోని ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం నుంచి మండలానికి వచ్చిన స్టూడెంట్స్ కిట్లను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి పదో తరగతి వరకూ సుమారు 3,530 మంది విద్యార్థులకు యూనిఫామ్, షూలు, బ్యాగ్‌లను త్వరలో విద్యార్థులకు ఆయా పాఠశాలలో అందజేస్తారన్నారు. మండలంలో హైస్కూళ్లు 9, ప్రాథమిక పాఠశాలలో 55 పాఠశాలల్లో 3,530 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు.

పింఛన్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి

అంబాజీపేట: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో భాగంగా జూలై 1వ తేదీన పింఛన్ల పంపిణీ ప్రతి ఒక్కరూ పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సచివాలయ ఉద్యోగులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్ పంపిణీ, తదితర అంశాలపై సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 9,383 పింఛన్లు ఉన్నాయని వీరికి రూ.6.22 కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. ఒకటో తేదీ రోజునే పెన్షన్ పంపిణీ విజయవతంగా పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జూలై 1వ తేదీన పింఛన్ పంపిణీ కోసం శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్‌డ్రా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పింఛన్ పంపిణీ కార్యక్రమానికి 1వ తేదీ ఉదయం 8 గంటలకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హాజరై పింఛను పంపిణీని ప్రారంభించనున్నారన్నారు.